సాక్షి
పార్వతీపురం మన్యం
మంగళవారం । 6 । ఫిబ్రవరి । 2024



కూలీ కుటుంబాల్లో ప్రమాద అలజడి - 8లో

వంగర, సీతంపేట మండలాల్లో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదాలు కూలీల కుటుంబాల్లో అలజడి రేపాయి.



గ్రూప్–2 అభ్యర్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ - 8లో

ప్రతిభ, నిరంతర శ్రమ విజయానికి నాందిగా నిలుస్తాయని ఏపీ శాసనసభా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి అన్నారు.



వినతుల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ

జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వివిధ సమస్యలపై ప్రజల నుంచి అందిన వినతుల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ నిషాంత్‌కుమార్ సూచించారు. - 8లో

ప్రభుత్వం 'మద్దతు'తో..

రైతన్నల్లో ఆనందం



చిత్రంలోని రైతు పేరు రౌతు రవికుమార్. వీరఘట్టం మండలం కత్తులకవిటి గ్రామం. 10 ఎకరాల్లో వరి పండించాడు. 262 క్వింటాళ్ల ధాన్యం దిగుబడి వచ్చింది. మండల వ్యవసాయశాఖ అధికారి సౌజన్యంలో గ్రామంలో ఉన్న ఆర్‌బీకే సిబ్బంది ధాన్యం మొత్తం కొనుగోలు చేశారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర క్వింటాకు రూ.2,183ల చొప్పున రూ.5,71,946లు, గోనె సంచులు, రవాణా ఖర్చుల కింద మరో రూ.2,112లు కలిపి రూ.5,74,058లు ఆయన బ్యాంకు ఖాతాలో మూడు విడతల్లో జమయ్యాయి. మునుపెన్నడూ ఇంత ఎక్కువ ధరకు ధాన్యం విక్రయించలేదని, ధాన్యం అమ్మేందుకు మిల్లర్ల చుట్టూ తిరిగితే వాళ్లు పట్టించుకునే వారు కాదని, చివరకు ఊరిలో ఉండే వ్యాపారులకు క్వింటా రూ.1200ల నుంచి రూ.1400లకు విక్రయించేవాడినని రవికుమార్ తెలిపాడు. ప్రభుత్వం చొరవతో క్వింటాకు రూ.700 వరకు అధికంగా ధర వచ్చినందుకు ఆనందం వ్యక్తం చేస్తున్నాడు.



ఈ ఫొటోలో ఉన్న రైతు పేరు పలగర తమ్మారావు. వీరఘట్టం మండలం కత్తులకవిటి. 12 ఎకరాల్లో వరి పంట సాగు చేయగా 292 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ఆయన వద్ద ఉన్న మొత్తం ధాన్యం కొనుగోలు చేసేందుకు ఆర్‌బీకే సిబ్బంది గోనెలు సమకూర్చారు. క్వింటాకు రూ.2,183 చొప్పున మద్దతు ధరగా నిర్ణయించి మిల్లుకు తరలించారు. ఆయనకు ఎటువంటి ఇబ్బంది లేకుండా కల్లాం నుంచే లారీలతో ధాన్యం తీసుకెళ్లారు. 21 రోజుల్లో ఆయన బ్యాంకు ఖాతాకు రూ.6,39,180లు నగదును ప్రభుత్వం జమచేసింది. దీంతో ఉబ్బితబ్బిబ్బవుతున్నాడు. ఆరుగాలం శ్రమించి సాగుచేసిన పంట ఇన్నాళ్లూ దళారుల పాలయ్యేదని, జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చలువతో రైతుకు వాస్తధర అందుతోందని ఆనందం వ్యక్తం చేస్తున్నాడు.

- రైతుల నుంచి నేరుగా ధాన్యం కొనుగోలు చేస్తున్న ప్రభుత్వం
- క్వింటాకు రూ.700 నుంచి రూ.800 వరకు మిగులు
- జిల్లాలో ఈ ఏడాది వరి సాగు: 1.59 లక్షల ఎకరాలు
- పంట దిగుబడి అంచనా: 3.15 లక్షల మెట్రిక్ టన్నులు
- జిల్లాలో ధాన్యం కొనుగోలు లక్ష్యం: 2,29,935 మెట్రిక్ టన్నులు
- ఇంతవరకు కొనుగోలు చేసిన ధాన్యం: 2,26,570 మెట్రిక్ టన్నులు
- ధాన్యం ఖరీదు: రూ.494.60 కోట్లు
- రైతులకు చెల్లించిన సొమ్ము: రూ.421 కోట్లు



వీరఘట్టం మండలం కత్తులకవిటిలో రైతు కల్లాం నుంచి ధాన్యం తరలింపు

వీరఘట్టం:

రైతన్నకు నాలుగున్నరేళ్లుగా మంచి రోజులు వచ్చాయి. సాగుకు ఠంచన్‌గా ఆర్థిక ఊతం అందించే నాయకుడు పాలకుడు కావడంతో.. రైతు కుటుంబాల్లో సంతోషం వెల్లివిరిస్తోంది. ఒకప్పుడు వరి పంటను సాగుచేసే రైతులు ధాన్యం విక్రయించాలంటే నానా తంటాలు పడాల్సి వచ్చేది. మిల్లర్లు, దళారుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగితే తూకంలో మోసం, అదనంగా బస్తాకు మూడు నుంచి నాలుగు కిలోలు తీసుకునేవారు. కేవలం బస్తాకు రూ.1200 నుంచి రూ.1400లు చెల్లించేవారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయేవారు. రైతులకు గిట్టుబాటయ్యేదికాదు. గత్యంతరం లేక వచ్చిన ధరకు ధాన్యం అమ్ముకోవాల్సి వచ్చేది. నేడు ఆ పరిస్థితి మారింది. దళారుల ఆగడాలకు, మిల్లర్ల మోసాలకు ప్రభుత్వం కళ్లెం వేసింది. అన్నం పెట్టే రైతన్నకు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలిచారు. ఆర్‌బీకేల ద్వారా నేరుగా ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు చేస్తుండడంతో గతంలో ఎన్నడూ లేని విధంగా రైతన్నకు మద్దతు ధర లభించడంపై సర్వత్రా రైతాంగం హర్షం వ్యక్తం చేస్తోంది.

ఇదీ పరిస్థితి....

గత ఖరీఫ్ సీజన్‌లో పార్వతీపురం మన్యం జిల్లాలో 1.59 లక్షల ఎకరాల్లో వరిపంట సాగు చేయగా పంట దిగుబడి 3.15 లక్షల మెట్రిక్ టన్నులు వస్తుందని అధికారులు అంచనా వేశారు. ఇందులో 2,29,935 మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యంగా చేసుకున్నారు. పంట దిగుబడితో పాటు నాణ్యమైన పంట పండడంతో రైతులకు గరిష్ట మద్దతు ధర ఇచ్చేందుకు చర్యలు చేపట్టారు. రెవెన్యూ, వ్యవసాయ, పౌరసరఫరాల శాఖ, మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు సమన్వయంతో ధాన్యం కొనుగోలు ప్రక్రియ మూడు నెలల కిందట ప్రారంభించారు. జిల్లాలోని 15 మండలాల్లో సోమవారం నాటికి 40,611 మంది రైతుల నుంచి క్వింటా ధాన్యం రూ.2,183 చొప్పున 2,26,570 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశారు. దీనికి రూ.494.60 కోట్లు రైతులకు చెల్లించాల్సి ఉండగా, రూ.421 కోట్లను ప్రభుత్వం జమచేసింది. మిగిలిన రైతులకు కూడా 21 రోజుల్లో చెల్లించేందుకు అన్ని చర్యలు చేపట్టారు. దీంతో ధాన్యం విక్రయించిన రైతులకు ఎంత సొమ్ము వస్తుందనే మెసేజ్‌లు మొబైల్స్‌కు రావడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రైతుకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు



ఈ ఏడాది రైతుకు ఎటువంటి ఇబ్బంది లేకుండా నేరుగా ఆర్‌బీకేల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తున్నాం. ఇంతవరకు 2,26,570 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశాం. మరో వారం రోజుల్లో మిగిలిన మొత్తం ధాన్యం కొనుగోలు చేస్తాం.

– దేవుళ్ల నాయక్, పౌరసరఫరాలశాఖ డీఎం, పార్వతీపురం మన్యం జిల్లా

న్యూస్‌రీల్

బాధ్యతల స్వీకరణ



కమాండెంట్ అధిరాజ్ సింగ్ రాణాకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న పోలీస్ అధికారులు, అసోసియేషన్ ప్రతినిధులు

డెంకాడ: చింతలవలస ఏపీఎస్పీ ఐదో బెటాలియన్ కమాండెంట్‌గా అధిరాజ్‌సింగ్ రాణా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ముందుగా బెటాలియన్ వద్ద ఉన్న వేంకటేశ్వరాస్వామి, ఉమామహేశ్వరస్వామి ఆలయాల్లో పూజలు చేశారు. కమాండెంట్ అధిరాజ్‌సింగ్‌రాణాకు పోలీస్ అసోసియేషన్ ప్రతినిధులు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. అసోసియేషన్ డైరీని కమాండెంట్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు మిత్తిరెడ్డి అప్పలనాయుడు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోరాడ రామునాయుడు, సెక్రెటరీ మజ్జి శ్రీనివాసరావు, ట్రెజరర్ పి.వి.ఆర్.మూర్తి, సభ్యులు రాంకుమార్, రాంబాబు, శేషగిరి, తదితరులు పాల్గొన్నారు.

విక్రాంత్‌కు శుభాకాంక్షలు



విక్రాంత్‌కు శుభాంక్షలు తెలియజేస్తున్న స్పీకర్, ఎమ్మెల్యేలు

పాలకొండ రూరల్/పాలకొండ: శాసన మండలి విప్ పాలవలస విక్రాంత్‌కు సభా ప్రాంగణంలో కేటాయించిన చాంబర్‌ను శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు సోమవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా విక్రాంత్‌ను సభాపతి తమ్మినేని సీతారాం, ఎమ్మెల్యేలు విశ్వాసరాయి కళావతి, రెడ్డి శాంతి, కంబాల జోగులు, శెట్టి ఫల్గుణ, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, కిల్లి కృపారాణి, తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తే కఠిన చర్యలు



వీరఘట్టంలోని కిరాణాదుకాణాలో తనిఖీ చేస్తున్న అధికారులు

వీరఘట్టం: నిషేధిత పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఢిల్లీ నుంచి వచ్చిన ప్రత్యేక బృందం వ్యాపారులను హెచ్చరించింది. ఎస్సై ఎం.గోవింద్‌తో కలిసి వీరఘట్టంలోని పలు కిరాణా దుకాణాలు, పాన్‌షాపుల్లో బృంద సభ్యులు తనిఖీలు చేశారు. చిన్నపిల్లలకు పొగాకు ఉత్పత్తులు విక్రయించరాదని సూచించారు. ప్రతిషాపు వద్ద పొగతాగడం హానికరం అనే బోర్డులు ఉంచాలన్నారు. లైసెన్సులు లేకుండా చుట్టలు తయారు చేయరాదన్నారు.

జర్నలిస్టుల ఇళ్లస్థల దరఖాస్తుల పరిశీలనకు కలెక్టర్ ఆదేశం

విజయనగరం అర్బన్: జిల్లాలో జర్నలిస్టుల ఇళ్ల స్థలాల మంజూరు కోసం వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిశీలించి అర్హుల జాబితాను అందజేయాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. జిల్లాలోని తహసీల్దార్లు, ఎంపీడీఓలతో పలు ప్రభుత్వ కార్యక్రమాల అమలుపై కలెక్టరేట్ నుంచి వీడియోకాన్ఫరెన్స్‌లో సోమవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో అన్ని మండలాలకు తొలి విడతగా వచ్చిన 276 మంది జర్నలిస్టుల దరఖాస్తులను పంపించామని, ప్రభుత్వ నిబంధనల మేరకు వారు అర్హులా కాదా అనే విషయాన్ని తనిఖీ చేసి అర్హులైన వారికి కేటాయించే నిమిత్తం ఎంత భూమి అవసరం ఉంటుందనే అంచనాలు రూపొందించాలన్నారు. ప్రభుత్వ భూమి అందుబాటులో ఉంటే వివరాలు అందజేయాలన్నారు. దీనిని అత్యంత ప్రాధాన్యతా అంశంగా భావించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ కె.కార్తీక్, ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ బీఎస్‌వీ త్రివినాగ్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

13న వేలంపాట

విజయనగరం ఫోర్ట్: వైద్యారోగ్యశాఖలో పనిచేయని 11 వాహనాలను ఈనెల 13వ తేదీ ఉదయం 11 గంటలకు వేలం వేయనున్నట్లు డీఎంహెచ్‌ఓ ఎస్. భాస్కరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలం వివరాలు ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు వేలం పాటలో పాల్గొని వాహనాలను సొంతం చేసుకోవచ్చన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోండి

- చెన్నై నాసిన్ అసిస్టెంట్ డైరెక్టర్ అనూరాధ రమేష్



మాట్లాడుతున్న చెన్నై నాసిన్ అసిస్టెంట్ డైరెక్టర్ అనూరాధ రమేష్

విజయనగరం క్రైమ్: పోలీస్ శిక్షణ కళాశాలలో ఇచ్చిన శిక్షణను పోలీస్ అధికారులందరూ శ్రద్ధగా నేర్చుకుని విధుల్లో రాణించాలని చెన్నై నాసిన్ అసిస్టెంట్ డైరెక్టర్ అనూరాధ రమేష్ సూచించారు. 81 మంది కస్టమ్స్ ఇన్స్‌పెక్టర్స్‌కు రెండు వారాలుగా నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె సోమవారం మాట్లాడారు. కస్టమ్స్ ఇన్స్‌పెక్టర్స్‌కు పోలీస్ శిక్షణ విధుల్లో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో పీటీసీ ప్రిన్సిపాల్ టి.ఆనందబాబు, వైస్ ప్రిన్సిపాల్ పీవీ అప్పారావు, డీఎస్పీలు సీహెచ్‌వీ రామారావు, వి.వి.అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

గంట్యాడ: మండలంలోని నరవ గ్రామ ఏఎంజీ కాలనీ సమీపంలో ఆదివారం సంభవించిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు.గంట్యాడ హెచ్‌సీ మజ్జి గణపతిరావు తెలిపిన వివరాల ప్రకారం.. బొండపల్లి మండలం జె.గుమడాం గ్రామానికి చెందిన బొత్స అప్పలరాజు విశాఖపట్నంలో టిఫిన్ దుకాణం నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఆయన కుమార్తె రజస్వల ఫంక్షన్‌కు స్వగ్రామానికి వారం రోజుల కిందట వచ్చాడు. ఈనెల 4న రాత్రి గుమడాం నుంచి పల్సర్ బైక్‌పై బయలు దేరి విజయనగరం వెళ్తుండగా నరవ ఏఎంజీ కాలనీ సమీపంలో విజయనగరం నుంచి వస్తున్న కారు ఢీకొట్టడంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు 108 సాయంతో విజయనగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం విశాఖపట్నంలోని కేజీహెచ్‌కు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మధ్యాహ్నం 2:30 గంటల సమయంలో మృతి చెందాడు.

డీ వార్మింగ్ డేను విజయవంతం చేయాలి

- కలెక్టర్ నిషాంత్‌కుమార్



పోస్టర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్ నిషాంత్‌కుమార్ తదితరులు

పార్వతీపురం: జిల్లాలో ఈనెల 9న నిర్వహించనున్న జాతీయ నులిపురుగుల నివారణ దినా(డీ వార్మింగ్ డే)న్ని విజయవంతం చేయాలని కలెక్టర్ నిషాంత్ కుమార్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులందరికీ ఆల్బెండజోల్ మాత్రల పంపిణీకి ఏర్పాట్లు పూర్తిచేయాలని స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జాతీయ నులిపురుగుల నివారణ దినం పోస్టర్‌ను సోమవారం కలెక్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని విద్యాసంస్థలన్నింటికీ మందుల పంపిణీ జరగాలని, ఈ కార్యక్రమాన్ని ఎప్పటికప్పుడు మండల ప్రత్యేకాధికారులు పర్యవేక్షణ చేయాలని సూచించారు. రక్త హీనత నివారణకు నులిపురుగుల నివారణ ఆవశ్యకత ఎంతో ఉందన్నారు. నులిపురుగుల కారణంగా రక్తహీనత, పోషకాల లోపం, ఆకలి మందగించడం, నీరసం, ఆందోళన, కడుపునొప్పి, వికారం, వాంతులు, విరేచనాలు, బరువు తగ్గడం వంటి సమస్యలు వస్తాయని చెప్పారు. అల్బెండజోల్ మాత్రతో ఈసమస్యలన్నీ పరిష్కారమవుతాయన్నారు. ఈనెల 9న మాత్రలు తీసుకుని 10, 11 తేదీలలో విధిగా విద్యార్థులకు అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో పాల్గొన్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.జగన్నాథరావు మాట్లాడుతూ జిల్లాలో 84,426 మంది బాలురు, 88,465 మంది బాలికలు వెరశి 1,75,891 మంది ఉన్నారన్నారు.

జిల్లాలో అంగన్‌వాడీలు మినహా 3,750 విద్యా సంస్థలున్నాయని, ప్రతి విద్యార్థికి 400 మిల్లీగ్రాముల మాత్రను ఉచితంగా అందజేయనున్నట్లు తెలిపారు. 1 నుంచి 5 ఏళ్ల మధ్య చిన్నారులకు అంగన్వాడీ కేంద్రంలోను, 6 నుంచి 19 ఏళ్ల విద్యార్థులకు పాఠశాలలు, కళాశాలల్లో పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. భోజనం అనంతరం మాత్రలను మింగించాలని, ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవని ధైర్యం చెప్పారు. మాత్ర వేసిన తరువాత ఎలాంటి సమస్య ఉత్పన్నమైనా స్థానిక వైద్యసిబ్బందిని సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో జేసీ ఆర్.గోవిందరావు, ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్, కేఆర్‌ఆర్‌సీ ఎస్‌డీసీ జి.కేశవనాయుడు, ఆరోగ్యశ్రీ జిల్లా సమన్వయ అధికారి డాక్టర్ కె.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

భజన గురువులను ఆదుకోవాలి

విజయనగరం టౌన్: ఆర్థికంగా వెనుకబడిన హిందూ భజన గురువులను ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు కోరారు. ఈ మేరకు సుమారు పది వేల మంది గురువులతో కోట జంక్షన్ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా భజన గురువుల సంఘ ప్రతినిధి కాళ్ల నాగభూషణరావు మాట్లాడుతూ.. కోలాటం, చెక్క భజన, తప్పిటగుళ్ల గురువులకు రూ. 10 వేల గౌరవ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి పెద్ద ఎత్తున హిందూ సోదరులు పాల్గొన్నారు.

మారేడు కాయలకు భలే గిరాకీ



మార్కెట్లో మారేడు కాయలకు డిమాండ్ నెలకుంది. ఏజెన్సీలో విరివిగా దొరికే మారేడు కాయలను సుగంధి అని పిలుస్తారు. వీటిని పొడరుగా చేసి వేసవిలో శీతల పానీయాల షాపుల్లో విక్రయిస్తారు. ఔషధ గుణాలు మెండుగా ఉండడంతో కేజీ మారేడు కాయలను స్థానిక వ్యాపారులు రూ.20కు కొనుగోలు చేస్తున్నారు. వాటిని బాగా ఎండబెట్టిన తరువాత కేజీ రూ.40కు మైదాన ప్రాంతాలకు విక్రయిస్తున్నట్టు వ్యాపారులు చెబుతున్నారు. వచ్చేది వేసవి కాలం దృష్ట్యా మరింత డిమాండ్ పెరుగుతుందని పేర్కొన్నారు. -కురుపాం

సాలూరు టీడీపీలో ముసలం

- పరిచయం కార్యక్రమంతో ప్రజల్లోకి తేజోవతి
- తనకే సీటు వస్తుందంటూ ప్రచారం
- అసహనంతో రగిలిపోతున్న సంధ్యారాణి వర్గం
- ఒకరిపై ఒకరు రుసరుసలు
- మక్కువ సాక్షిగా వేర్వేరు కుంపట్లు



మక్కువ: సాలూరు నియోజకవర్గ టీడీపీలో కొత్త ముసలం పుట్టింది. ఎమ్మెల్యే సీటు తనకేనంటూ తేజోవతి ప్రచారం చేస్తున్నారు. పరిచయ కార్యక్రమం పేరుతో పార్టీ శ్రేణులతో సమావేశమవుతున్నారు. తనకే సీటువస్తుందంటూ ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఇది మింగుడుపడని టీడీపీ సాలూరు నియోజకవర్గ సమన్వయకర్త సంధ్యారాణి వర్గం భగ్గుమంటోంది. ఇప్పటికే ఓ వైపు సంధ్యారాణి వర్గం, మరోవైపు భంజదేవ్ వర్గాలు ఢీ అంటే ఢీ అంటున్నాయి. సోషల్ మీడియా పోస్టులపై పోలీస్ కేసుల వరకు వెళ్లాయి. ఇప్పుడు తాజాగా తేజోవతి తెరపైకి రావడం, సాలూరు సీటు జనసేన అభ్యర్థికి కేటాయిస్తారన్న ప్రచారంతో పార్టీలో 'ఎవరికి వారే యమునా తీరే' అన్నచందంగా తయారైంది. సీటు తమకే ఇవ్వాలని ఎవరికి వారే అధిష్టానాన్ని ప్రసన్నం చేసుకుంటున్నారు. తమ వర్గం అభ్యర్థికి సీటు ఇవ్వకుంటే ఎట్టి పరిస్థితిలోనే సహకరించేది లేదని సమావేశాలు పెట్టిమరీ స్పష్టం చేస్తున్నారు. మరికొందరు మండల స్థాయి నాయకులు ఒక అడుగు ముందుకు వేసి సంధ్యారాణి తమ కాళ్లుపట్టుకుంటేనే సహకరిస్తామని ప్రకటనలు చేస్తున్నారు. అసలే ప్రజాదరణలేక కునారిల్లుతున్న సాలూరు నియోజకవర్గ టీడీపీలో వర్గ విబేధాలు పార్టీ శ్రేణులను అయోమయానికి గురిచేస్తున్నాయి.

సమావేశాలు సాక్షిగా..

ఐవీఆర్‌ఎస్ ద్వారా వెలుగులోకి వచ్చిన తేజోవతి టీడీపీ మక్కువ మండల మాజీ అధ్యక్షుడు పెంట తిరుపతిరావు ఆధ్వర్యంలో ఇటీవల డి.శిర్లాం, కోన గ్రామాల్లో బాబు ష్యూరిటీ, భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. తనే అభ్యర్థినంటూ తేజోవతి ప్రచారం చేశారు. ఇది నచ్చని ప్రస్తుత టీడీపీ మండలాధ్యక్షుడు వేణుగోపాలరావు, సంధ్యారాణితో కలిసి తేజోవతి వర్గంపై విమర్శలు గుప్పించారు. 2014 నుంచి 2019 వరకు పార్టీని అడ్డంపెట్టుకొని, కోట్లు సంపాదించి, అధికారం కోల్పోయిన వారంరోజులకే పార్టీని వీడిన వలస పక్షులకు పార్టీ నిబంధనలు అర్థంకావంటూ మండిపడ్డారు. దీనికి కౌంటర్‌గా తిరుపతిరావు విలేకరుల సమావేశం సాక్షిగా గుమ్మడి సంధ్యారాణిపై పలు ఆరోపణలు చేశారు. 2014 టీడీపీ ప్రభుత్వం హయంలో చేపట్టిన ప్రహరీ నిర్మాణాల బిల్లుల మంజూరులో ఎమ్మెల్సీగా పనిచేసిన సంధ్యారాణి కనీసం సాయం చేయలేదన్నారు. బిల్లుల మంజూరులో వైఎస్సార్‌సీపీ నాయకులు సహకరించారని, ఇది చెప్పుకునేందుకే సిగ్గుచేటన్నారు. టీడీపీ నియమించిన సర్వేటీమ్స్ తేజోవతి అభ్యర్థిత్వాన్ని పరిశీలిస్తున్నాయన్నారు. ఒకవేళ అధిష్టానం సంధ్యారాణికి ఎమ్మెల్యే టిక్కెట్ ఇస్తే, మా వర్గం నాయకుల కాళ్లుపట్టుకుంటే తప్ప సహకరించేది లేదని తిరుపతిరావు తెగేసి చెప్పారు. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో ఓ పార్టీ నుంచి సుమారు రూ.2కోట్లు ఎవరిద్వారా, ఎవరిరెవరకి అందాయో? అందరికీ తెలుసన్నారు. చంద్రబాబు నాయుడి దృష్టికి ఆధారాలతో సహా తీసుకెళ్తానన్నారు. మక్కువలో ఇటీవల ఏర్పాటు చేసిన సమావేశంలో తేజోవతి మాట్లాడుతూ తన అభ్యర్థిత్వాన్ని గుళ్ల వేణుగోపాలరావు తిరస్కరించడం విచారకరమన్నారు. నేను అభ్యర్థిని కాదంటే ఐవీఆర్‌ఎస్ సర్వేలో నా పేరు ఎందుకు ఉంటుందని ప్రశ్నించారు. 20 ఏళ్ల ఉపాధ్యాయవృత్తి సర్వీసును వదిలి రాజకీయాల్లో వచ్చానని, అభ్యర్థికాదంటే ఒప్పుకునేది లేదన్నారు.

కానసింగిలో కొత్తల పండగ



గుమ్మలక్ష్మీపురం మండలం కానసింగి గిరిజన గ్రామంలో సోమవారం కొత్తల పండగ డప్పు మోగింది. పదేళ్లకోసారి జరిగే పండగను గిరిజనులందరూ కలిసి వైభవంగా జరిపారు. ముందుగా గ్రామదేవతలకు పూజలు చేశారు. మొక్కుబడులు చెల్లించారు. డప్పువాయిద్యాలను లయబద్ధంగా మోగించారు. సంప్రదాయ నృత్యాలతో అలరించారు. ఛత్రాలతో సందడి చేశారు.

– గుమ్మలక్ష్మీపురం

క్లుప్తంగా

పామాయిల్ తోటలో ఏనుగుల బీభత్సం



పాడైన పామాయిల్ మొక్కను చూపిస్తున్న రైతు గుంపస్వామి నాయుడు

జియ్యమ్మవలస: మండలంలోని బిత్రపాడు సచివాలయం పరిధిలో బిత్రపాడు, బట్లభద్ర పంట పొలాల్లో సోమవారం ఏనుగులు బీభత్సం సృష్టించాయి. పామాయిల్ తోటలో 69 మొక్కలను ధ్వంసం చేశాయని బిత్రపాడు గ్రామానికి చెందిన రైతు నీరస గుంపస్వామినాయుడు వాపోయాడు. మొక్క వేసి రెండు సంవత్సరాలు గడిచిందని, మరో సంవత్సరంలో గెలలు తెగుతాయని తెలిపాడు. గ్రామంలోని చాలామంది రైతులకు చెందిన పామాయిల్, అరటి తోటలను ధ్వంసం చేశాయని తెలిపారు. అటవీసిబ్బంది వాటిని తరలించే ప్రయత్నం చేయాలని రైతులు కోరుతున్నారు.

అంతర్ రాష్ట్ర చెక్‌పోస్టుల వద్ద నిఘా



అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్టును తనిఖీచేస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

పార్వతీపురంటౌన్: అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్టుల వద్ద మరింత నిఘా పెంచామని పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన పార్వతీపురం మండలంలోని ఆర్‌కే బట్టివలస సమీపంలో ఏర్పాటు చేసిన అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్టును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఒడిశా రాష్ట్రం నుంచి సారా, గంజాయి, మాదక ద్రవ్యాల రవాణాపై ప్రత్యేక నిఘా పెట్టి భద్రతను పెంచామన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా పరిధిలో 10 అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామని ఒడిశా నుంచి మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, పాత నేరస్తుల కదలికలపై ప్రత్యేక నిఘా పెట్టామని తెలిపారు. ఈ చెక్‌పోస్టుల వద్ద అన్ని రకాల వాహనాలను తనిఖీచేస్తున్నామన్నారు. పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, వాహనాలన్నింటినీ క్షుణ్ణంగా తనిఖీచేయాలని కోరారు. అనుమానం ఉన్న, ముందస్తు సమాచారం ఉన్న వాహనాలపై తక్షణమే ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని సూచించారు.

పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

- కలెక్టర్ నాగలక్ష్మి



మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ కార్తీక్

విజయనగరం అర్బన్: పదోతరగతి, ఇంటర్‌మీడియట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. సంబంధిత శాఖల అధికారులంతా సమన్వయంతో ఈ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. పది, ఇంటర్‌మీడియట్ పరీక్షల నిర్వహణ గురించి వివిధ శాఖల అధికారులతో కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వచ్చే నెల 1వ తేదీ నుంచి ఇంటర్‌మీడియట్, 18 నుంచి పదోతరగతి వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నాయని తెలిపారు. ఇంటర్‌మీడియట్ ఒకేషనల్ ప్రాక్టికల్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయని, ఇక నుంచి వరుసగా పరీక్షలు జరుగుతాయని చెప్పారు. పదోతరగతి పరీక్షలకు సుమారు 27,277 మంది హాజరవుతారని వారికోసం జిల్లా వ్యాప్తంగా 129 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

94 పరీక్షా కేంద్రాల ఏర్పాటు

పరీక్షల నిర్వహణకు సుమారు 1,600 మంది ఇన్విజిలేటర్లు, 9 ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశామన్నారు. ఇంటర్‌మీడియట్ పరీక్షల కోసం సుమారు 45 వేల మంది హాజరుకానున్నారని, అందుకోసం 94 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను అమలు చేయాలని చుట్టుపక్కల జిరాక్స్, ఇంటర్నెట్ సెంటర్లను మూసివేయాలని ఆదేశించారు. విద్యార్థులకు తాగునీటి సదుపాయం కల్పించాలని చెప్పారు. రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని కేంద్రాలవద్ద వైద్యబృందాలను, అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలన్నారు. పరీక్ష జరిగే సమయంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే పరీక్షా పత్రాలను ఉంచే స్ట్రాంగ్ రూమ్‌లవద్ద, రూట్లలో, పరీక్షా కేంద్రాల వద్ద తగిన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని, విద్యార్థుల పరీక్ష సమయానికి అనుగుణంగా ఆర్‌టీసీ బస్సుల వేళలను సవరించాలని సూచించారు. పరీక్షల నిర్వహణను ఏడు శాఖల అధికారులు సమన్వయంతో విజయవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో జేసీ కె.కార్తీక్, అసిస్టెంట్ కలెక్టర్ వెంకట త్రివినాగ్, డీఈఓ బి.లింగేశ్వర రెడ్డి, ప్రాంతీయ ఇంటర్‌మీడియట్ అధికారి మజ్జి ఆదినారాయణ, డీవీఈఓ భీమశంకర్, డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు, ట్రాన్స్‌కో ఎస్‌ఈ లక్ష్మణరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹120	₹210	₹220

కూలీ కుటుంబాల్లో ప్రమాద అలజడి

ఉమ్మడి విజయనగరం జిల్లాలో వేర్వేరు ప్రదేశాల్లో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదాలు కూలీల కుటుంబాల్లో అలజడి రేపాయి. ఆస్పత్రులకు పరుగులు పెట్టించాయి. సీతంపేట మండలంలో ఉదయాన్నే మినపచేను తీతకు వెళ్తున్నవారి ఆటో బోల్తాకొట్టి 18 మంది గాయపడగా, వంగర మండలంలో ఆర్టీసీ బస్సు–ఆటో ఢీకొనడంతో 12 మంది గాయపడ్డారు. వీరంతా ప్రస్తుతం వేర్వేరు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు.

- వంగర మండలంలో ఆర్టీసీ బస్సు–ఆటో ఢీ
- 12 మందికి గాయాలు
- ఇద్దరు పరిస్థితి విషమం
- సీతంపేట మండలంలో బోల్తాకొట్టిన ఆటో
- 18 మందికి స్వల్పగాయాలు
- క్షతగాత్రులంతా రైతు కూలీలే..



వంగర: తీవ్రంగా గాయపడిన కలమట రత్నాలు



వంగర: తీవ్రంగా గాయపడిన ముంజి రమణమ్మ



వంగర: నుజ్జయిన ఆటో ముందర భాగం

వంగర: మండల పరిధి రుషింగి–చినరాజులగుమ్మడ గ్రామాల మధ్య సోమవారం సాయంత్రం ఆర్టీసీ బస్సు–ఆటో ఢీకొనడంతో 12 మంది గాయపడ్డారు. వీరిలో ఏడుగురికి తీవ్రగాయాలు కాగా, మరో ఐదుగురికి స్వల్ప గాయాలయ్యాయి. రాజాం నుంచి రుషింగి మీదుగా జేకేగుమ్మడ వెళ్తున్న ఆర్టీసీ బస్సు, రాజులగుమ్మడ పంటపొలాల్లో చెరకు కటింగ్ పనులు పూర్తి చేసుకొని స్వగ్రామం శివ్వాంకు కూలీలతో వస్తున్న ఆటో ఢీకొన్నాయి. ప్రమాదంలో ఆటో డ్రైవర్ మడే శంకర్, కలమట రత్నాలు, గేదెల నాగమణి, ముంజి రమణమ్మ, గేదెల సింహాలు, గేదెల నాగమణి, ఉదయాన కృష్ణవేణి, బలగ తవుడమ్మ, గేదెల అప్పలనరసమ్మ, మడే శాంతమ్మ, బమ్మిడి గౌరీశ్వరీలు గాయపడ్డారు. స్థానికుల సమాచారం మేరకు వంగర, వీరఘట్టం, రేగిడి మండలాలకు చెందిన 108 వాహనాల్లో క్షతగాత్రులను రాజాంలోని జీఎంఆర్ కేర్ ఆస్పత్రికి తరలించారు. వీరిలో ఇద్దరు పరిస్థితి విషమంగా ఉండడంతో శ్రీకాకుళం రిమ్స్‌కు తీసుకెళ్లారు. శివ్వాం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు బొక్కేల వెంకటప్పలనాయుడు రాజాం ఆస్పత్రికి వెళ్లి క్షతగాత్రుల వైద్యసేవలకు అవసరమైన సహాయం అందించారు. వైఎస్సార్‌సీపీ రాజాం నియోజకవర్గ సమన్వయకర్త తలేరాజేష్ ఆస్పత్రికి వెళ్లి క్షతగాత్రులను పరామర్శించారు. ప్రమాద వివరాలపై ఆరా తీశారు. ప్రమాద స్థలాన్ని రేగిడి ఎస్సై శ్రీనివాసరావు, వంగర పోలీసులు పరిశీలించారు. కేసు నమోదు చేశారు.



ఆస్పత్రిలో క్షతగాత్రుడిని పరీక్షిస్తున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్

సీతంపేటలో ప్రమాదం జరిగిందిలా..

సీతంపేట: మినప చేను తీతకు వెళ్తున్న కూలీల ఆటో బోల్తా పడిన ఘటనలో 18 మందికి గాయాలయ్యాయి. వీరిలో ముగ్గురికి తీవ్రగాయాలుకావడంతో మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చేశారు. మిగతా 15 మందికి స్వల్పగాయాలు కావడంతో సీతంపేట ప్రాంతీయ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీకాకుళం జిల్లా కొత్తూరు మండలం మహిసింగి ఆర్‌ఆర్ కాలనీకి చెందిన కె.హేమలత, ఢిల్లీశ్వరి, జి.ప్రసాదరావు, కె.పద్మావతి, కె.గంగమ్మ, ఎన్.దాలమ్మ, టి.సంజీవమ్మ, కె.రమణమ్మ, జి.అమ్మన్నమ్మ, ఎ.సరోజనమ్మ, జి.సరస్వతి, పి.అప్పలస్వామి, కె.గౌరమ్మ తదితరులు ఆటోలో పాలకొండ మండలం లక్కుపురం వెళ్తుండగా సీతంపేట యూత్ ట్రైనింగ్ సెంటర్ వద్దకు వచ్చేసరికి ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. పాలకొండ నుంచి కొత్తూరు వైపు వస్తున్న 108 సిబ్బంది ఈఎంటీ రాములు, పైలెట్ మోహన్‌రావులు ఘటన చూసి వెంటనే సపర్యలు చేశారు. స్థానిక ఏరియా ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ సూపరెండింటెంట్ బి.శ్రీనివాసరావు నేతృత్వంలో వైద్య సిబ్బంది గాయపడిన వారికి ఎక్స్‌రేలు తీయించి వైద్యం అందజేశారు. స్వల్పగాయాలైన వారికి చికిత్స చేసి ఇంటికి పంపించేశారు. హేమలత, లక్ష్మి, దాలమ్మలకు తలపై గాయాలు కావడంతో రిమ్స్‌కు రిఫర్ చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



సీతంపేట ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ప్రమాద బాధితులు

నేడు శంబర పోలమాంబ మూడో జాతర

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారు మూడవ జాతర మంగళవారం జరగనుంది. జాతరకు వచ్చే భక్తుల సౌకర్యార్థం ఈవో వీవీ సూర్యనారాయణ పర్యవేక్షణలో ఏర్పాట్లు చేపట్టారు. భక్తులకు అవసరమైన లడ్డు, పులిహోర ప్రసాదాలను తయారు చేయించారు. జాతరకు వచ్చిన భక్తులు ఇబ్బందులు పడకుండా సీఐ జి.బాలకృష్ణ, ఎస్సై నరసింహమూర్తి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించనున్నారు.

జాతీయస్థాయి సైక్లింగ్ పోటీలకు తోండ్రంగి విద్యార్థులు



సైక్లింగ్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మండలంలోని తోండ్రంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు జాతీయస్థాయి సైక్లింగ్ పోటీల్లో ప్రాతినిధ్యం వహించనున్నారు. డిసెంబర్‌లో జరిగిన ఏపీ స్టేట్ సైక్లింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాఠశాలకు చెందిన విద్యార్థినులు జమ్ము భవాని, చింతపల్లి ప్రవల్లిక, జమ్ము వెన్నెల, నిద్దాన జ్యోషిత, పొట్నూరు థెరిసాతో పాటు చీపురుపల్లిలోని ప్రైవేట్ కళాశాలకు చెందిన పి.నానాజీ, వాల్లె హరిప్రసాద్‌లు ప్రతిభ కనబరిచి బంగారు పతకాలు సాధించి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఫిబ్రవరి 8 నుంచి 13 వరకు జార్ఖండ్ రాష్ట్ర రాజధాని రాంచీలో జరగనున్న జాతీయస్థాయి సైక్లింగ్ పోటీల్లో ఈ విద్యార్థినులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహించనున్నారు. జాతీయస్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం వహించనున్న విద్యార్థినులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఏవీ.రమణరాజు, వ్యాయామ ఉపాధ్యాయుడు టి.సత్యనారాయణ అభినందించారు.

శాంతిభద్రతల పరిరక్షణలో 'ఆర్మ్‌డ్' పాత్ర కీలకం

- పునశ్చరణ తరగతులు ప్రారంభించిన అదనపు ఎస్పీ



పునశ్చరణ తరగతుల్లో మాట్లాడుతున్న అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్

విజయనగరం క్రైమ్: ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసుల పాత్ర శాంతి భద్రతల పరిరక్షణలో చాలా కీలకమైనదని జిల్లా అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్ పేర్కొన్నారు. ఏటా 15 రోజుల పాటు ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసులకు నిర్వహించే పునశ్చరణ తరగతులను ఆమె సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలీసు విధులను నిర్వహించినప్పుడు నిష్పక్షపాతంగా, అంకితభావం, నిజాయితీతో వ్యవహరించి, ప్రజలకు మరింత చేరువ కావాలని సూచించారు. విధుల్లో నైపుణ్యం సాధించేందుకు ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసులకు ప్రతి ఏడాదీ నిర్వహించే పునశ్చరణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. తరగతులు ఫిబ్రవరి 5 నుంచి 19 వరకూ నిర్వహిస్తామని తెలిపారు. యూనిఫాం ధరించిన తర్వాత ప్రజల ధన, మాన ప్రాణాల రక్షణకే పోలీసులు పునరంకితం కావాలని హితవు పలికారు. ప్రస్తుత పరిస్థితులు, అవసరాల దృష్ట్యా ఈ మొబిలైజేషన్‌లో ఏఆర్ పోలీసులు ఒత్తిడిని జయించేందుకు యోగా, వ్యక్తిత్వ వికాసం, ఆరోగ్య, ఆర్థిక పరిస్థితులను మెరుగుపర్చేందుకు ప్రణాళికాయుతంగా కొన్ని కార్యక్రమాలను నిర్వహిస్తామని చెప్పారు. వృత్తిపరమైన నైపుణ్యాన్ని పెంపొందించేందుకు శారీరక దారుఢ్యం పెంచేందుకు, వివిధ ఆయుధాల ఉపయోగాలను, ముఖ్యమైన బందోబస్తు విధులను ఏ విధంగా నిర్వహించాలో, ఫైరింగ్ ప్రాక్టీస్, బాంబ్ స్క్వాడ్ పనితీరు ఏ విధంగా చేపట్టాలో, మస్కట్రీ శిక్షణ అందించనున్నామన్నారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ యూనివర్స్, ఆర్ఐ టి.శ్రీనివాసరావు, ఆర్ఎస్సైలు నారాయణరావు, రామకృష్ణ, శ్రీనివాసరావు, ప్రసాదరావు, నీలిమ, కేశవరావు, అక్షయ్‌కుమార్, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలకు చెందిన పలువురు ఏఆర్ ఎస్సైలు, హెచ్‌సీలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రూప్–2 అభ్యర్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



గ్రూప్–2 అభ్యర్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



క్రీడాకారులను అభినందిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: ప్రతిభ, నిరంత శ్రమ విజయానికి నాందిగా నిలుస్తాయని ఏపీ శాసనసభా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి అన్నారు. ఈ మేరకు గ్రూప్–2 పరీక్షలకు సిద్ధమవుతున్న శిక్షణార్థులకు అవసరమైన స్టడీ మెటీరియల్‌ను విజయనగరంలోని ఆనందగజపతి కళాక్షేత్రంలో సోమవారం ఆయన ఉచితంగా అందజేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందించి మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. యుక్త వయసులోనే చదువుకోవడం సాధ్యమవుతుందని వయసు మళ్లిన తర్వాత చదువుపై పట్టు కోల్పోతామన్న విషయాన్ని గ్రహించాలని హితవు పలికారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులకు ఎటువంటి సహాయ సహకారాలు అవసరమైన తనను సంప్రదించవచ్చని భరోసా ఇచ్చారు. ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులు ఏ ప్రాంతానికి చెందిన వారైనప్పటికీ ఉచితంగా భోజన ఏర్పాట్లు చేసే యోచనలో ఉన్నామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వర్ కౌశిక్, శ్రీనివాస్, మండారవి తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండో క్రీడాకారులకు అభినందన

రాష్ట్రస్థాయిలో జరిగిన తైక్వాండో పోటీల్లో బంగారు పతకాలు దక్కించుకుని జాతీయ పోటీల్లో పాల్గొన్న విజయనగరం క్రీడాకారులు వి.కుషాల్ గణదీప్, పి.పునీత్‌లను ఏపీ శాసనసభా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అభినందించారు. ఈ మేరకు సోమవారం నగరంలోని 16వ డివిజన్ కార్పొరేటర్ గుజ్జలనారాయణరావు ఆధ్వర్యంలో ఇద్దరు క్రీడాకారులు డిప్యూటీ స్పీకర్‌ను ఆయన నివాసంలో కలిశారు. రాష్ట్రస్థాయి పోటీల్లో బంగారు పతకాలు దక్కించుకున్న క్రీడాకారులు ఇటీవల ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌లో జరిగిన జాతీయ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు తరపున ప్రాతినిధ్యం వహించినట్లు నారాయణరావు వివరించారు. ఈ సందర్భంగా ఆ ఇద్దరు క్రీడాకారులను అభినందించిన డిప్యూటీ స్పీకర్ భవిష్యత్‌లో జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో రాణించాలని, అందుకు అవసరమైన శిక్షణతో తైక్వాండోలో రాటుదేలాలని సూచించారు.

179 మద్యం సీసాల పట్టివేత



చీపురుపల్లి: పట్టుబడిన మద్యం బాటిల్స్, నిందితులతో ఎస్సై, సిబ్బంది



రామభద్రపురం: మద్యం బాటిల్స్‌తో పట్టుబడిన నిందితుడితో ఎస్సై జ్ఞానప్రసాద్, ఏఎస్సై అప్పారావు

చీపురుపల్లి: మద్యం అక్రమంగా రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను చీపురుపల్లి మండలంలోని ఇటకర్లపల్లి గ్రామంలో అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై కె.కిరణ్‌కుమార్ నాయుడు చెప్పారు. ఈ మేరకు సోమవారం ఆయన తెలిపిన వివరాల మేరకు ఇటకర్లపల్లి గ్రామంలో తనిఖీలు నిర్వహిస్తుండగా ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై 179 మద్యం బాటిల్స్ అక్రమంగా తరలిస్తూ పట్టుబడ్డారు. దీంతో అక్రమంగా రవాణా చేస్తున్న మద్యం బాటిల్స్‌ను, ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసి పట్టుబడిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేశారు.

రామభద్రపురంలో 23 మద్యం బాటిల్స్

రామభద్రపురం: మండలకేంద్రంలో సోమవారం ఓ వ్యక్తి అక్రమంగా తరలిస్తున్న మద్యబాటిల్స్‌ను సిబ్బందితో కలిసి ఎస్సై జ్ఞానప్రసాద్ పట్టుకున్నారు. దీనిపై ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం దత్తిరాజేరు మండలం కోరపుకొత్తవలస గ్రామానికి చెందిన ఓ వ్యక్తి 28 మద్యం బాటిల్స్ అక్రమంగా తీసుకువెళ్తుండగా పట్టుబడ్డాడు. దీంతో మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేశారు.

ఎల్.కోటలో 25 మద్యం సీసాలు

లక్కవరపుకోట: మండలంలోని గేదెలవానిపాలెం పంచాయతీ శివారు వేచలపువానిపాలెం గ్రామానికి చెందిన యు.ఎస్.రామారావు అక్రమంగా 25 మద్యం సీసాలను తరలిస్తుండగా ఎస్సై ఆర్.గోపాలరావు ఆధ్వర్యంలో పోలీసులు సోమవారం పట్టుకున్నారు. ఈ సందర్భంగా మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి

సీతంపేట: విద్యార్థులు పలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని పాలకొండ జూనియర్ సివిల్‌కోర్టు న్యాయమూర్తి ఎ.విజయకుమార్ అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన సీతంపేటలోని ప్రభుత్వోన్నత పాఠశాలలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. పోక్సో, జువైనల్ చట్టాల గురించి విద్యార్థులకు వివరించారు. ప్రతి నెలా లీగల్ లిటరసీ క్లబ్ నిర్వహించాలని ఉపాధ్యాయుడు ప్రాణిగ్రహికి సూచించారు. కార్యక్రమంలో పాలకొండ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.సత్యంనాయుడు, న్యాయవాదులు ఎం.శామ్యూల్, ఆర్.కుమారస్వామి, కిరణ్మయి, హెచ్‌ఎం హేమసుందర్, ఉపాధ్యాయులు గోవిందనాయుడు, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వినతుల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ

- కలెక్టర్ నాగలక్ష్మి



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ కె.కార్తీక్

విజయనగరం అర్బన్: జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వివిధ సమస్యలపై ప్రభుత్వ శాఖలకు ప్రజల నుంచి అందిన వినతులను పరిశీలించి ప్రత్యేక శ్రద్ధ పెట్టి వాటిపై స్పందించాలని అధికారులకు కలెక్టర్ నాగలక్ష్మి సూచించారు. ఈ మేరకు కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన వినతుల స్వీకరణ కార్యక్రమంలో జేసీ కె.కార్తీక్, డీఆర్‌ఓ ఎస్‌డీ అనిత, ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ బీఎస్‌వీత్రివినాగ్‌లతో కలిసి కలెక్టర్ నాగలక్ష్మి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలపై 200 వినతులు అందాయి. వాటిలో అత్యధికంగా రెవెన్యూశాఖ సమస్యలపై 132, డీఆర్‌డీఏకు సంబంధించి 26, గ్రామ వార్డు సచివాలయాల శాఖకు 13, మునిసిపల్ సమస్యలపై 9, పంచాయితీ విభాగానికి 8, గృహ నిర్మాణ శాఖకు 7, జిల్లా ఆసుపత్రుల సేవలకు సంబంధించి 3, ఏపీవిద్యుత్ పంపిణీ సంస్థకు సంబంధించి 2 వినతులు ఉన్నాయి. ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్లు మురళీకృష్ణ, కేఆర్‌ఆర్‌సీ డిప్యూటీ కలెక్టర్ సుమబాల తదితరులు వినతుల స్వీకరణలో పాల్గొన్నారు.

వినతులకు శాశ్వత పరిష్కారం

పార్వతీపురం: జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చిన వినతులకు శాశ్వత పరిష్కారం చూపాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిషాంత్‌కుమార్ మండల అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో కలెక్టర్‌తోపాటు ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్, కేఆర్‌సీసీ డిప్యూటీ కలెక్టర్ కేశవ నాయుడు ప్రజలనుంచి వినతులను స్వీకరించారు. ప్రజల నుంచి వచ్చిన వినతుల పరిష్కారం కోసం సంబంధిత అధికారులతో మాట్లాడి సకాలంలో పరిష్కరించాలని సూచించారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజలు సామాజిక, వ్యక్తిగత అంశాలపై సమర్పించిన 185 అర్జీలను కలెక్టర్ స్వీకరించారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకర రావు, జిల్లా వ్యవసాయ అధికారి కె.రాబర్ట్‌పాల్, బీసీ వెల్ఫేర్ అధికారి ఎస్.కృష్ణ, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, డీపీఓ బి.సత్యనారాయణ, డీఈఓ ఎన్.ప్రేమ్‌కుమార్, జిల్లా ప్రణాళికా అధికారి పి. వీరరాజు, జిల్లా రవాణాధికారి సి.మల్లికార్జునరెడ్డి, డీఎంహెచ్‌ఓ బి.జగన్నాథరావు, ఐసీడీఎస్ పీడీ నూర్జహాన్ రాణి తదితరులు పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదులకు తక్షణ పరిష్కారం

విజయనగరం క్రైమ్: స్పందన కార్యక్రమానికి వచ్చే ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని విజయనగరం ఎస్పీ ఎం.దీపిక పోలీస్ అధికారులకు ఆదేశాలు జారీచేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఆమె స్పందన కార్యక్రమం నిర్వహించి బాధితుల నుంచి 39 ఫిర్యాదులను స్వీకరించి, వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టారు. బాధితుల సమస్యలను తెలుసుకుని, సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడి, ఫిర్యాదుదారుల సమస్యల పరిష్కారానికి చట్టపరిధిలో చర్యలు చేపట్టి, న్యాయం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్, ట్రైనీ ఐపీఎస్ మండా జావలి అల్ఫాన్స్, డీటీసీ డీఎస్పీ వీరకుమార్, ఎస్బీ సీఐలు కేకేవీ.విజయనాథ్, ఈ.నరసింహమూర్తి, ఎస్సై ప్రభావతి పాల్గొన్నారు.



వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

ఫిర్యాదులపై సత్వర న్యాయం

పార్వతీపురంటౌన్: స్పందన కార్యక్రమంలో బాధితులు అందజేసే ఫిర్యాదులపై సత్వర న్యాయం జరగాలని పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. ఈ మేరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమాన్ని సోమవారం ఆయన నిర్వహించి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను స్వీకరించి, వారితో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వేధింపులు, కుటుంబ కలహాలు, సివిల్ తగాదాలు, ఇతర సమస్యలపై ఫిర్యాదు దారులు విన్నవించుకోగా, వారి సమస్యలపై సంబంధిత పోలీసు అధికారులతో ఎస్పీ స్వయంగా ఫోన్‌లో మాట్లాడి సత్వర న్యాయం అందించేలా కృషి చేయాలని స్పష్టం చేశారు. బాధితులకు చట్ట పరిధిలో తక్షణ న్యాయం అందించేలా చర్యలు తీసుకుని, తీసుకున్న చర్యలకు సంబంధించిన నివేదికను జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి పంపాలని అధికారులను ఆదేశించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని హితవు పలికారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ డాక్టర్ ఒ.దిలీప్ కిరణ్, ఎస్బీ సీఐ సీహెచ్ లక్ష్మణ రావు సిబ్బంది పాల్గొన్నారు.



బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ ఎం.దీపిక



పార్వతీపురం టౌన్: అర్జీదారుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్